క్లుప్తంగా

సచివాలయ క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడ టౌన్: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకోటేశ్వర రావు, మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస రావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉద్యోగులు పరస్పర సహకారంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాజా, కార్యదర్శి జి. శంకరరావు, కోశాధికారులు పి. రవికుమార్, పి. రోజ, వైస్ ప్రెసిడెంట్‌లు కె. సునీత, కె. మనోజ్ కుమార్, జి. గణేష్, జాయింట్ సెక్రటరీలు నాగరాజు, డి. బేబీదుర్గ, కె. భారతి, కె. వినీల తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు నిధులు కేటాయించాలి

కైకలూరు: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోడానికి రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని వరహాపట్నంలో ఇంటి వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు బాధితులు బుధవారం వినతి పత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కైకలూరు అధ్యక్షుడు చక్కా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్ వ్యవస్థను ఉపయోగించి అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలని కోరారు. ఎమ్మెల్యే కామినేని సానుకూలంగా స్పందించారని తెలిపారు. బాధితులు అలజంగి రాంబాబు, బంకపల్లి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు భోజనం ప్లేట్ల వితరణ



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం రూ.10వేల విలువైన భోజన ప్లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని తన స్నేహితురాలైన పూర్వ విద్యార్థిని నాగరాణి, త్రిపురనేని నవకృష్ణ చౌదరి దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహించామని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ జగన్మోహనరావు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, మాజీ అధ్యాపకుడు నిమ్మగడ్డ కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

గుడ్లవల్లేరు/గుడివాడ టౌన్: విద్యుత్ వినియోగదారులకు అదాలత్‌తో పాటు అవగాహన సదస్సును గురువారం నిర్వహించనున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరరావు బుధవారం తెలిపారు. గుడివాడ డివిజన్ పరిధిలోని పెదపారుపూడి, బాపులపాడు, ఉంగుటూరుతో పాటు గుడివాడ నియోజకవర్గం, కైకలూరు నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని డీపీఎస్ కాంప్లెక్స్‌లోని వేదిక ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఈ అదాలత్ జరుగనుందని పేర్కొన్నారు. జిల్లా మాజీ సీనియర్ జడ్జి, విజయవాడ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన ఈ అదాలత్ జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, విద్యుత్ లైన్ల, విద్యుత్ బిల్లుల సమస్యలు, లో ఓల్టేజ్ ఇబ్బందులు తదితరాలపై పరిష్కారం పొందవచ్చని చెప్పారు. వినియోగదారులు తమ వ్యక్తిగత, సామాజిక విద్యుత్ సమస్యలపై రాత పూర్వకంగా ఫిర్యాదుల ద్వారా తెలియపరిచేందుకు ఈ అదాలత్, అవగాహన సదస్సును వినియోగించుకోవాలని ఈఈ కోరారు.

అన్నదాతలకూ ఓ 'ఆధార్'

- ప్రత్యేకంగా విశిష్ట గుర్తింపు సంఖ్య
- ప్రారంభమైన నమోదు ప్రక్రియ
- భవిష్యత్తులో పథకాలన్నింటికీ ఇదే ఆధారం



మోటూరు గ్రామంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

గుడివాడరూరల్: ఆధార్ కార్డు తరహాలోనే అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ డిజిటల్ గుర్తింపు సంఖ్య(విశిష్ట గుర్తింపు సంఖ్య) ఇచ్చే ప్రక్రియను ఇటీవల ప్రారంభించింది. ప్రభుత్వం అందించే రైతు సేవలు సులభతరం చేయడంతో పాటు పారదర్శకంగా అమలు చేసేందుకు ఇది దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. అన్నదాతలు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరీకల్చర్ అసిస్టెంట్లు యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు రైతులకు అందవు. ప్రధానంగా పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు కూడా అందవు. వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల సలహాలకు కూడా దూరమవ్వాల్సి ఉంటుంది.

నమోదు ఇలా..

రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి రైతు పేరు, గ్రామం, ఆధార్ నంబర్, పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ వివరాలు అందించాలి. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. రైతుసేవా కేంద్రాలకు వెళ్లకపోతే, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అందించి, ఓటీపీ చెప్పడం ద్వారా రైతుల వివరాలు నమోదు పూర్తి చేసుకోవచ్చు.

ఇలా భద్రపరుచుకోవాలి..

యాప్ ద్వారా నమోదు చేసుకున్న తర్వాత అందించే గుర్తింపు సంఖ్య మెసేజ్ రూపంలో రైతు ఫోన్‌కు వస్తుంది. ఆ నంబర్‌ను రైతు ఫోన్‌లో భద్రపర్చుకోవాలని, పాసు పుస్తకంపై రాసి ఉంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. గుర్తింపు సంఖ్య మరచిపోతే రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాలు అందించి తెలుసుకోవచ్చు.

నియోజకవర్గంలో పరిస్థితి..

మండలం	సాగు భూమి	రైతులు
గుడివాడ	15,000 ఎకరాలు	6,500మంది
నందివాడ	4,262ఎకరాలు	2,030మంది
గుడ్లవల్లేరు	22,494ఎకరాలు	10,500మంది

ఈనెలాఖరు వరకు గడువు..



రైతులందరూ ఈ నెల 25వ తేదీ లోగా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి. లేకుంటే ప్రభుత్వం అందించే పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం కోల్పోతారు. సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలి.

– బోలెం అనంతలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

అనుమతుల్లేవు.. ఎవ్వరూ కొనుగోలు చేయొద్దు

సాక్షి ఎఫెక్ట్

కురుమద్దాలి(పామర్రు): గ్రామ పరిధిలోని ఉరుటూరు వెళ్లే రహదారి పక్కనే వేసిన వెంచర్‌కు ఏవిధమైన అనుమతులు లేవని, ఎవ్వరూ కొనుగోలు చేయవద్దని గ్రామ కార్యదర్శి అంజనాదేవి అక్రమ వెంచర్ల యజమానికి హెచ్చరికలు జారీ చేస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. ఈనెల 10వ తేదీన సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామ పరిధిలోని శ్రీవారాహి ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ వారు ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్ వద్ద బుధవారం బ్యానర్‌ను కట్టారు. ఆమె మాట్లాడుతూ ఈ స్థలంలో వెంచర్ వేసేందుకు, ప్లాట్లు అమ్మకొనేందుకు ఏపీ సీఆర్‌డీఏ అనుమతులు లేవన్నారు. ఎవ్వరూ ఈ స్థలంలో ప్లాట్లు కొనుగోలు చేయరాదని పేర్కొన్నారు. ఎవ్వరైనా కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో వారికి కలిగే నష్టానికి పంచాయతీ ఏవిధమైన బాధ్యత వహించదని పేర్కొన్నారు. అంతేకాకుండా అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తున్న వెంచర్ యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు మండలంలోని వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు జి. వెంకటేశ్వరరావు, సురేష్ ప్రారంభించారు. డీఆర్‌పీలు శ్రీనివాసరావు, పార్థసారథి, రాయల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సుజాత, నాగమల్లేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వల్లూరుపాలెంలో మాట్లాడుతున్న ఎంఈఓలు సురేష్, వెంకటేశ్వరరావు

కొనసాగిన శిక్షణ

కైకలూరు: ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యపై మండలంలోని 74 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ఉన్నత పాఠశాలలో అందిస్తున్న శిక్షణ బుధవారానికి రెండో రోజుకు చేరింది. బాల్యారంభ దశలు, మెదడు అభివృద్ధి అంశాలపై అభ్యసన నైపుణ్యాలపై శిక్షణ అందించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయ రిసోర్సు పర్సన్లు వి.రామోజీ, ఆర్‌కే నాయుడు, ఎస్.సతీష్ అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. సీడీపీవో డాక్టర్ దీప్తి మాట్లాడుతూ రాష్ట్ర విద్యా మండలి, ఐసీడీఎస్, పోషణ్ అభియాన్, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో 120 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో డి.రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, షామిదాఖానమ్ పాల్గొన్నారు.



కైకలూరు ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు శిక్షణ అందిస్తున్న సిబ్బంది

లారీల పార్కింగ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు

పామర్రు: స్థానిక బస్టాండ్ వద్ద లారీలను నిలుపుదల చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇసుక లోడ్‌తో ఉన్న 7 టిప్పర్లను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని వాటిని స్థానిక బస్టాండ్ వద్ద ఉంచారు. విజయవాడ-మచిలీపట్నం రహదారిలో బస్టాండ్ వద్ద డివైడర్ ఉండటం, రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ వద్ద బస్సులు ఆగే స్థలం వద్ద లారీలను ఉంచడం వల్ల బస్సులు రోడ్డుపైనే నిలుపుదల చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. కొన్ని సమయాలలో బస్సులను ఇక్కడ ఆపకుండా వెళ్లి పోతున్నారు. దీని వల్ల కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఒక్కొక్కసారి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి కైనా పోలీసు అధికారులు స్పందించి లారీలను రోడ్డు పక్క నుంచి మరొక ప్రదేశానికి తరలించి ట్రాఫిక్ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



బస్టాండ్ వద్ద నిలిపిన లారీల వల్ల ఏర్పడిన ట్రాఫిక్

మొవ్వలో 1,259 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

మొవ్వ: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో మొవ్వ మండలం నుంచి 1259 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇదే విషయాన్ని మండల తహసీల్దార్ కె. మస్తాన్ బుధవారం వెల్లడించారు. మండలంలోని 16 సచివాలయాల వీఆర్‌వోల ద్వారా 21 గ్రామ పంచాయతీలలో గల ఓటర్ల స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూలులోని రెండు పోలింగ్ కేంద్రాలలో జరిగే ఈ ఎన్నికలకు ఓటర్లు ఉదయం 8:00 నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపుగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పమిడిముక్కల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులకు జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. చెత్త సేకరణ ఫొటోలను ప్రతిరోజు ఉదయం యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆరుబయట ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు.

ఆక్రమణల చెరలో పామర్రు కాలువ

పామర్రు: గ్రామంలోని పుల్లేరు నుంచి నాగలేరు వరకు ఏర్పాటు చేసిన సప్లై కాలువ ఆక్రమణలకు గురైయింది. కాలువ గుర్రపు డెక్క తూడు కాడ చెత్తా చెదారాలతో నిండిపోయి నీటి సరఫరాలకు అంతరాయంగా మారుతున్నాయి. కాలువ గట్లపై ఉన్న ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకున్న అనేక మంది గృహాలను నిర్మించుకుని జీవిస్తున్నారు. వీరు వాడేసిన వ్యర్థ పదార్థాలను కాలువలోకి వేయడం వల్ల కాలువ కలుషితం అవుతోంది. కాలువ చెత్త చెదారాలతో నిండిపోతోంది. ఎంతో విలువైన ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువ గట్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ జేఈఈ సాధిక్‌ను వివరణ కోరగా కాలువ గట్లపై ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించామని, ఈ విషయాన్ని ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగు విధమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

భాషపై ఇష్టాన్ని పెంచుకోవాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వడాలి జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భాషోత్సవాలపై విద్యార్థులకు బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. మాతృభాషకు ప్రాధాన్యతనిస్తూ ఇతర భాషలపై కృషి చేయాలన్నారు. ప్రతి భాషపై ఆసక్తిని పెంచుకుంటూ తగిన గౌరవాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.

ఊపందుకున్న మినుము తీత పనులు



సింగలూరులో మినుము తీతలు తీస్తున్న మహిళా కూలీలు

తోట్లవల్లూరు: మినుము తీత పనులు ఊపందుకున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో గత కొన్ని రోజులుగా రైతులు మినుము తీత పనులు నిర్వహిస్తున్నారు. ఖరీఫ్ అనంతరం మండల వ్యాప్తంగా సుమారు 4 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మినుము పంటను రైతులు సాగు చేశారు. పంట కాలం పూర్తి కావటంతో మినుము తీత పనుల్లో బిజీగా ఉన్నారు. మినుము తీత పూర్తయిన రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి పనులు నిర్వహిస్తున్నారు.

ముందస్తుగానే మినప తీతలు...

గుడ్లవల్లేరు: అకాల వర్షాలు, సాగునీటి ఎద్దడితో ఖరీఫ్‌లో వరి దిగుబడులు అంతంతమాత్రంగానే రైతులకు చేతికి అందాయి. ఈ తరుణంలో రబీలో సాగు చేస్తున్న మినుములో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తే ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చని వేయి కళ్లతో ఎదురు చూస్తున్న రైతుకు నిరాశే ఎదురైంది. మినుము పైరులో మారుకా మచ్చల పురుగు, పొగాకు లద్దె పురుగు, ఎల్లోమోజాయిక్ తెగుళ్లు మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ నెలాఖరుకు మినుము తీతలు ప్రారంభం కావలసి ఉండగా ఇప్పటి నుంచే సింగలూరులో రైతులు మినుమును తీయించేస్తున్నారు. ఈ కారణంగా ఎకరానికి ఆరు బస్తాల వరకు ఆశించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఎకరానికి మూడు నుంచి నాలుగు బస్తాలే చేతికి అందుతున్నాయని ఆందోళనకు గురవుతున్నారు. ఎకరానికి 22నుంచి 23మంది కూలీలు పడుతున్నారు. ఒక్కో కూలికి రూ.250 నుంచి రూ.300వరకు ఎకరానికి రూ.7వేల వరకు మినుము తీతలకే ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు

గుడివాడ టౌన్: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ కోట్లాదిమంది భారతీయులకు స్ఫూర్తి ఛత్రపతి శివాజీ మహరాజ్ అని కొనియాడారు. వీరోచిత పోరాటాలకు ఆయన ఒక చరిత్ర అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, సభ్యులు పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

పామర్రు: ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు కె. చంద్రశేఖర్ అన్నారు. స్థానిక శివాలయం సెంటర్‌లోని లలిత కళా తోరణం వద్ద హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భక్తికి, ధీరత్వానికి, దైవ భక్తికి మారు పేరుగా ఉన్న ఛత్రపతి శివాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత చైతన్య వేదిక సభ్యులు అందరూ గ్రామ పురవీధులలో జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేశారు. ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు వేదాంతం రాధేశ్యామ్, హిందు చైతన్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్

సమస్యల 'కూడలి'



పామర్రులోని నాలుగురోడ్ల కూడలి

- ఆక్రమణలతో కుచించుకుపోయిన రహదారి
- కనీసం మరుగుదొడ్లు కూడా లేక ప్రయాణికుల ఇబ్బందులు

పామర్రు: నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోని స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద మరుగు దొడ్లు లేని కారణంగా ప్రయాణికులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. పామర్రు నుంచి విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, చల్లపల్లి వెళ్లాల్సిన ప్రయాణికులు కూడలి వద్దకు చేరుకుని బస్సులు ఎక్కాల్సి ఉంది. బస్సులు ఆలస్యమైతే చాలా సేపు అక్కడే ఉండాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇక్కడ మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఇక్కడి రోడ్డు మార్జిన్లు పూర్తిగా ఆక్రమణలకు గురవడంతో కనీసం నిలబడేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. డివైడర్లను కూడా చిరువ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో రహదారి కూడా కుచించుకుపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి పామర్రులో ప్రాధాన్యమైన నాలుగు రోడ్ల కూడలిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు ఆక్రమణలను సరిచేయాలని పలువురు ప్రయాణికులు విన్నవిస్తున్నారు.

మహిళలకు బాగా ఇబ్బంది..



పామర్రులోని కూడలి వద్ద మరుగుదొడ్ల లేని కారణంగా ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా మహిళలు అవస్థలు పడుతున్నారు. కూడలి వద్ద నిలబడటానికి కూడా ఖాళీ లేని విధంగా ఆక్రమణలు ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కె. రాణి, బల్లిపర్రు

త్వరలో మరుగుదొడ్ల నిర్మాణం..



కూడలి వద్ద మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి వినతులు వచ్చాయి. గ్రామ సభ, పంచాయతీ సమావేశంలో దీనిపై తీర్మానం చేసి ఆమోదించాం. త్వరలో కూడలి వద్ద మరుగుదొడ్లను ఏర్పాటు చేసి ప్రయాణికులు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్ సలీం, పామర్రు గ్రామ కార్యదర్శి

ధ్యాన శివుని విగ్రహావిష్కరణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వారంపై నూతనంగా ఏర్పాటు చేసిన 16 అడుగుల ధ్యాన శివుని విగ్రహావిష్కరణ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి ఈ విగ్రహ ఆవిష్కరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రవికాంత్ పర్యవేక్షించారు.

● ప్రయాణం.. ప్రత్యక్ష నరకం



కూచికాయలపూడి-విన్నకోట ప్రధాన రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. ఈ రహదారిపై ఐదు ప్రధాన గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తూ.. అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో రాకపోకలు సాహసోపేతంగా మారాయి. భారీగా గతుకులు, గోతుల్లో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం రోడ్డుకు మరమ్మతులు అయినా చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. – గుడ్లవల్లేరు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



మహిళలను అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పురుషులతో పాటు సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆయన చాంబర్‌లో బుధవారం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మచిలీపట్నంకు చెందిన ముగ్గురు మహిళలను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్న ముంతాజ్‌బేగం, రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీ రాష్ట్రపతి భవన్ ఎట్ హోంలో వీణ వాయిద్యంతో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు పొందిన అప్పికట్ల దీప్తి, ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో మూడు పతకాలు పొందిన తోట విజయకుమారిలను కలెక్టర్ డీకే బాలాజీ సత్కరించి అభినందించారు.